సాక్షి సిద్దిపేట

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



పోషక లోప నివారణ..

చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఈ నెల 17 నుంచి పోషణ మాసం ప్రారంభిస్తున్నారు. వివరాలు 8లో ▸



కమ్యూనిస్టులే..

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టు నేతలేనని సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸



దిగుబడిపై దిగాలు..

భారీ వర్షాల కారణంగా పత్తి, వరి పంటలు దెబ్బతినడంతో దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్ధరించండి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మంత్రి పొన్నం లేఖ

హుస్నాబాద్: పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌లో రైల్వే టికెట్ బుకింగ్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. రైలు టికెట్లు బుక్ చేసుకోవడానికి మంచి సదుపాయం ఉండేదని, ఈ కౌంటర్ మూసివేయడంతో అందరికీ అసౌకర్యంగా మారిందన్నారు. కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, పోస్టల్ శాఖలోని సంబంధిత అధికారులతో చర్చించి కేంద్రాన్ని త్వరగా పునరుద్ధరించాలని మంత్రి పొన్నం లేఖలో విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్‌లో విలీనం చేయండి

హుస్నాబాద్‌లో బీజేపీ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: పట్టణాన్ని కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అశాస్త్రీయంగా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి మూడు జిల్లాల్లో కలిపిందన్నారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 20 నెలలు దాటుతున్నా విలీనంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంపత్ నాయక్, నాయకులు శ్రీనివాస్, సతీష్, రాజేంద్ర ప్రసాద్, బొల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలోనే ప్రీ ప్రైమరీ నిర్వహించాలి

మంత్రి కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా



మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ విద్యను అంగన్ వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హుస్నాబాద్‌లోని మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ పోటీ సెంటర్లను ప్రారంభించి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేయాలనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకే ప్రీ ప్రైమరీ విద్యను అప్పగించాలన్నారు. అనంతరం మంత్రి పీఏకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ తదితరులు ఉన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



విత్తన బంతులు విసురుతున్న ప్రభాకర్‌వర్మ, చందర్‌రావులు


సిద్దిపేటరూరల్: మొక్కలను విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పర్యావరణ ప్రేమికుడు, నవ సమాజ నిర్మాణ సమితి జాతీయ అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్ వర్మ అన్నారు. సోమవారం రావురూకుల మాజీ ఎంపీపీ గన్నమనేని శ్రీదేవి చందర్ రావుతో కలిసి విత్తన బంతులను వెదజల్లారు. ఈ సందర్భంగా ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా 10 లక్షల విత్తన బంతులు తయారుచేసి, రోడ్ల వెంబడి, గుట్టలపైన అడవుల్లో చల్లుతున్నామన్నారు. దీని ద్వారా చెట్ల పెంపకానికి దోహదం చేయడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నట్లు తెలిపారు. ఎవరికైనా విత్తన బంతులు కావాలంటే ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. విత్తన బంతులలో ముఖ్యంగా మర్రి, మారేడు, వేప, రావి, జువ్వి, చింత, ఉసిరి, సీమసింత, మామిడి లాంటివి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మామిళ్ల ఐలయ్య యాదవ్, లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌లోకి గోదారి పరవళ్లు



మల్లన్నసాగర్‌లోకి ఆరు పంపుల ద్వారా గోదావరి జలాల పంపింగ్

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ కొనసాగుతోంది. రిజర్వాయర్‌లో నీటి మట్టం సోమవారం నాటికి 23.5 టీఎంసీలకు చేరింది. అలాగే కొండపోచమ్మ సాగర్‌లో 11 టీఎంసీలకు చేరిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గత ఆగస్టు నెల 19న ఎత్తిపోతలు ప్రారంభించారు. 28 రోజులుగా పంపింగ్ కొనసాగుతుండగా కొండపోచమ్మ సాగర్‌కు గోదావరి జలాల పంపిణీ జరుగుతున్నట్లు డీఈఈ చెన్ను శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ ఏడాది మల్లన్న సాగర్‌లో 30 టీఎంసీల నీటిని నిల్వ చేయనున్నట్లు చెప్పారు.



నాచగిరి వద్ద పొంగిపొర్లుతున్న హల్దీ చెక్‌డ్యాం

ఉప్పొంగిన హరిద్ర

నాచగిరి హరిద్ర ఉప్పొంగింది. భారీ వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతితో పరవళ్లు తొక్కుతోంది. ఆలయం ముందు సాగిపోతూ పర్యాటకులను కనువిందుచేస్తోంది. సోమవారం తెల్లవారుజామునుంచి చెక్‌డ్యాం పొంగిపొర్లుతూ ఆహ్లాదం పంచుతోంది. – వర్గల్(గజ్వేల్)

దంచికొట్టిన వాన

నారాయణరావుపేటలో 24.5 సెంటీమీటర్ల వర్షం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జోరుగా వర్షం కురిసింది. జిల్లాలో సగటున 38.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా నారాయణరావుపేట మండల కేంద్రంలో 24.5 సెం.మీ. వర్షం కురిసింది. మిరుదొడ్డి మండల కేంద్రంలో 87మి.మీ., బేగంపేట గ్రామంలో 86మి.మీ., రాంపూర్‌లో 82.8మి.మీ., పోతారెడ్డిపేటలో 76.8మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ప్రహరీ కూలిపోయింది. వర్షం నేపథ్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు.

స.హ.చట్టం.. ఎవరికీ పట్టని చుట్టం




సమాచారం అరకొర.. రాష్ట్ర కమిషన్ వద్దకు బిరబిర

- జిల్లా వ్యాప్తంగా రెండో అప్పీల్‌లో 137 కేసులు
- పలు కార్యాలయాల్లో కన్పించని బోర్డులు
- నేడు జిల్లాకు సమాచార హక్కు కమిషనర్లు

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ సంస్థల్లో, పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనం పెంచడమే సమాచార హక్కు చట్టం లక్ష్యం. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా భారత పౌరసత్వం కలిగిన వ్యక్తులు అవసరమైన సమాచారాన్ని కోరవచ్చు. జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలలో సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం అరకొరగా ఇవ్వడం, దరఖాస్తు చేసిన తర్వాత నిర్ణీత సమయం దాటినా సమాచారం ఇవ్వకపోవడంతో రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌కు అప్పీల్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి ఇప్పటి వరకు 137 మంది దరఖాస్తు దారులు అప్పీల్‌కు వెళ్లారు. దీంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో అప్పీల్ కేసులు పరిష్కరించేందుకు సమాచార హక్కు కమిషనర్లు వస్తున్నారు.

■ సమాచార హక్కు చట్టం కింద సిద్దిపేట పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఇంటి నిర్మాణాల గురించి డిసెంబర్ నెలలో మున్సిపాలిటీలో ప్రవీణ్ దరఖాస్తు చేశారు. మే నెల వరకు వేచి చూసినా అధికారులు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వలేదు. దీంతో సదరు దరఖాస్తు దారుడు అప్పీల్ కోసం రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌ను ఆశ్రయించారు.

■ జిల్లా వ్యాప్తంగా ఎన్ని క్రీడా ప్రాంగణాలు నిర్మించారు? ఎన్ని వినియోగంలో ఉన్నాయని సిద్దిపేటకు చెందిన వ్యక్తి ఆర్టీఐ కింద డీఆర్‌డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అధికారులు ఇచ్చిన సమాచారం సరిగా లేదని రాష్ట్ర ఆర్టీఐ కమిషన్‌ను ఆశ్రయించారు.



పక్క ఫొటోలో కన్పిస్తున్నది మిషన్ భగీరథ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు లో భాగంగా ఏ అధికారిని సంప్రదించాలని తెలిపే బోర్డు. ఈ బోర్డులో ఉన్న అప్పీల్ అధికారి, ఈఈ గిరిధర్ గత నెల 31న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి బోర్డులో అధికారి పేరు మార్చలేదు. అలాగే ప్రత్యేకంగా బోర్డు కాకుండా వైట్ పేపర్‌లో ప్రింట్ తీసి అతికించడం గమనార్హం.

కన్పించని బోర్డులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ బోర్డులలో పౌర సమాచార అధికారి పేరు, ఫోన్ నంబర్ ముద్రించి ఉండాలని చట్టం చెప్తుంది. కానీ పలు కార్యాలయాల్లో నిబంధనలు అధికారులు ఉల్లంగిస్తున్నారు. అధికారులు బదిలీ అయినా పాత వారి పేర్లే దర్శనమిస్తున్నాయి.

నేడు ఆర్టీఐ కమిషనర్ల రాక

స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డితోపాటు ఐదుగురు కమిషనర్లు పీవీ శ్రీనివాస రావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, మోహిసినా పర్వీన్, భూపాల్, వైష్ణవిలు మంగళవారం సిద్దిపేటకు రానున్నారు. పీఐఓ (పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్)లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించనున్నారు.

రెవెన్యూ కేసులే అధికం

సమాచార హక్కు చట్టం–2005 కింద దరఖాస్తు దారుడు అడిగిన సమాచారాన్ని 30రోజుల్లోగా పీఐఓ సమాచారం ఇవ్వాలి. లేని పక్షంలో దరఖాస్తు దారుడు మొదటి అప్పీల్ చేసుకోవచ్చు. 90 రోజుల్లోగా సమాచారం రాకుంటే రెండో అప్పీల్‌గా రాష్ట్ర సమచార హక్కు కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. జిల్లా వ్యాప్తంగా 137 మంది రెండో అప్పీల్‌కు వెళ్లారు. అందులో రెవెన్యూ అప్పీల్ కేసులే అధికంగా ఉన్నాయి. రెవెన్యూకు సంబంధించనవి 88, ఆర్ అండ్ ఆర్‌కు 15, వ్యవసాయశాఖ 4, ట్రాన్స్‌పోర్టు 4, వైద్యారోగ్య శాఖ 2, విద్యుత్ శాఖ 2, ట్రైబల్ వెల్ఫేర్ 2, ఇతర శాఖలకు చెందినవి 20 కేసులున్నాయి.

పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేపట్టాలి

- కలెక్టర్ హైమావతి
- అధికారులతో సమావేశం



స్వచ్ఛతా హీ సేవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

సిద్దిపేటరూరల్: జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్నందున పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలతో నేల చిత్తడిగా మారి, నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు.

■ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్త్ నారి స్వశక్తి అభియాన్ కార్యక్రమాన్ని సంక్షేమ శాఖ, డీఆర్డీఓ, విద్య తదితర శాఖల సమన్వయంతో ఆస్పత్రులలో నిర్వహించాలన్నారు. అన్ని వయస్సు బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ ను ఆదేశించారు.

■ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ద్వారా ఈనెల 17 నుంచి 2 వ తేదీ వరకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో శ్రమదానం, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యర్థాలు తొలగింపు, పర్యావరణహితమైన పండుగల నిర్వహణకు చర్యలు చేపట్టాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య ను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య తో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వినతులు పరిష్కారం అవుతున్నందునా ప్రజావాణిపై విశ్వాసం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. భూ సమస్యలు, పలు సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 152 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయండి

పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే అర్జీదారులకు రశీదు పొందడం సమస్యగా మారింది. వినతిపత్రాన్ని అందించిన అనంతరం రశీదు కోసం కౌంటర్ ఒక్కటే ఉండడంతో తీవ్ర ఆలస్యమవుతుంది. గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. అధికారులు మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అర్జీదారులు కోరుతున్నారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు పేట విద్యార్థులు

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్ –14 వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఎంఈఓ నర్సయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శ్యాంసుందర్, గణేశ్, మనోజ్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అలాగే వాలీబాల్ పోటీల్లో వెంకట్రావుపేట జట్టు జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. పాఠశాల హెచ్ఎం నయీమా కౌసర్, పీఈటీ కనకయ్య, విద్యార్థులను ఎంఈఓ అభినందించారు.

రోడ్డెక్కిన రైతులు

తీరని యూరియా వెతలు



జగదేవ్‌పూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు



హుస్నాబాద్‌రూరల్: ఎరువుల దుకాణం ఎదుట రైతుల ఆందోళన

జగదేవ్‌పూర్(గజ్వేల్)/హుస్నాబాద్‌రూరల్/మద్దూరు(హుస్నాబాద్): యూరియా కోసం రైతుల అరిగోస వీడటంలేదు. సోమవారం పలు ప్రాంతాల్లో బారులు తీరారు. యూరియా అందకపోవడంతో కొన్ని చోట్ల ఆందోళనకు దిగారు. జగదేవ్‌పూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదను దాటుతున్నా పంటకు యూరియా వేయకపోవంతో ఎదుగుదల ఆగిపోతున్నదని వాపోయారు. ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు.

– హుస్నాబాద్‌లో యూరియా అందకపోవడంతో రైతులు ఆగ్రహించి ఎరువుల దుకాణం ఎదుట బైఠాయించారు. దుకాణ యజమాని యూరియా బస్తాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని మండిపడ్డారు. యజమానిపై చర్యలు తీసుకుని షాప్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఓ వచ్చి నచ్చజెప్పినా వినిపించుకోలేదు. యజమానికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తానని, విశాల పరపతి సంఘంలో ఎరువులు ఇప్పిస్తానని చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు.

– మద్దూరు రైతువేదిక, పీఏసీఎస్ సొసైటీల వద్ద రైతులు పడిగాపులు కాశారు. బస్తా యూరియా కోసం రోజంతా నిరీక్షించాల్సి వచ్చిందని రైతులు వాపోయారు.



మద్దూరు: యూరియా కోసం రైతుల నిరీక్షణ

కొరత లేదు.. ఆందోళన వద్దు

డీఏఓ స్వరూపరాణి

సిద్దిపేటరూరల్: జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి తెలిపారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటుగా, గుర్రాలగొందిలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ యూరియా విషయంలో రైతులు ఎలాంటి అధైర్యపడొద్దని, ఎప్పటికప్పుడు యూరియాను అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సాగు చేస్తున్న పంటలను ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

సుందరీకరణకు మంగళం

ఎనిమిది పనుల్లో మూడే పూర్తి

- రూ.2కోట్ల నిధుల్లో అరకొర వినియోగం
- మిగిలిన నిధులు ల్యాప్స్
- తాజాగా రూ.15కోట్లతో ప్రతిపాదనలు

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సుందరీకరణ పనులకు మంగళం పాడారు. పట్టణంలోని ఎనిమిది జంక్షన్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా.. కేవలం మూడింటిని మాత్రమే అభివృద్ధి చేసి చేతులు దులుపుకొన్నారు. రూ.2 కోట్ల నిధులు గతంలో విడుదల కాగా పావు వంతుకుపైగా నిధులు ఖర్చుపెట్టి.. మిగిలిన నిధులు ల్యాప్స్ చేశారు. ఈ క్రమంలోనే తాజాగా మరో రూ.15కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులకు ఆమోదం వస్తేనే పట్టణానికి కొత్త కళ రానుంది.

– గజ్వేల్



గజ్వేల్‌లో సుందరీకరణ పనులు నిలిచిన పోయిన ఇందిరాపార్కు చౌరస్తా ఇదే

‘అన్నీ ఉన్నా.. అల్లుడు నోట్లో శని’ అనే సామెత గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి సరిగ్గా సరిపోతుంది. అభివృద్ధిలో ఆదర్శంగా కీర్తించిన ఈ మున్సిపాలిటీలో ప్రధాన పనులు పూర్తి చేయకపోవడంతో నిధులు సగంలోనే ల్యాప్స్ కావడం ఆందోళన కలిగిస్తోంది. మూడున్నరేళ్ల క్రితం పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సంకల్పించారు. ఈ క్రమంలోనే పట్టణంలోని మహనీయుల విగ్రహాల జంక్షన్లను అందంగా తీర్చిదిద్ది, వాటర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేయాలని, ‘లవ్ జీపీపీ’ పేరిట స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇందుకోసం అప్పట్లో ‘గడా’ (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా రూ.2కోట్లు నిధులు కూడా విడుదల చేసిన సంగతి తెల్సిందే. ఈ క్రమంలోనే పట్టణంలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా, పిడిచెడ్ రోడ్డు చౌరస్తా, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాపార్కు చౌరస్తా, జాలిగామ బైపాస్ రోడ్డు చౌరస్తా, తూప్రాన్ రోడ్డులోని బాబుజగ్జీవన్‌రామ్ వై జంక్షన్, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ వద్ద గల సర్కిల్, ముట్రాజ్‌పల్లి సర్కిళ్లను అందంగా తీర్చిదిద్దడానికి సంకల్పించారు. కానీ ఇందులో అంబేడ్కర్ చౌరస్తా, బాబూజగ్జీవన్‌రామ్ చౌరస్తా, ముట్రాజ్‌పల్లి చౌరస్తాలో మాత్రమే పనులను పూర్తి చేసి, మిగతా పనులను చేపట్టలేదు.

ఎందుకీ పరిస్థితి?

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఈ మున్సిపాలిటీకి అడిగిందే తడవుగా నిధులు వచ్చాయి. కానీ నిధులను సకాలంలో వినియోగించి పట్టణ ప్రగతిని పరిగెత్తించడంలో మాజీ పాలకవర్గం పూర్తిగా విఫలమైంది. ప్రత్యేకించి పట్టణంలో సుందరీకరణ పనులు పూర్తి కాకపోవడానికి, సగంలోనే నిధులు ల్యాప్స్ కావడానికి పాలకవర్గంలోని విభేదాలే కారణంగా నిలిచాయి. ఇందిరాపార్కు చౌరస్తాతో ఇతర కూడలిల పనుల ప్రారంభానికి ప్రజాప్రతినిధులే అడ్డంకిగా మారారు.

కొత్తగా ప్రతిపాదనలు

పట్టణంలో సుందరీకరణ పనులను పూర్తి చేయడమేకాకుండా, సెంట్రల్ లైటింగ్, హౌసింగ్ బోర్డు మైదానంలోని చిల్డ్రన్స్ పార్కు ఆధునీకరణ, డ్రైనేజీలు, వరద కాల్వ నిర్మాణానికి రూ.15కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఇందిరా పార్క్ కూడలి, ఇతర కూడళ్ల సుందరీకరణకు రూ.కోటి, చిల్డ్రన్స్ పార్కుకు రూ.కోటి, పట్టణంలోని ప్రధాన రహదారులపై పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ కోసం రూ.1.5కోట్లు, సుమారు మరో 10కోట్లకుపైగా సీసీ రోడ్లు, ఇతర పనులకు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణానికి నయా లుక్ రానుంది. ఈ అంశంపై స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా గతంలో ‘గడా’ ద్వారా వచ్చిన సుందరీకరణ నిధులు ల్యాప్స్ అయిన మాట వాస్తవమేనన్నారు. తాజాగా ఇటీవల రూ.15కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆమోదం రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు.

క్లుప్తంగా

మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి


జిల్లా ఎస్పీని కలిసిన కృష్ణమూర్తి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావును మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తికి అప్పగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అలాగే పేకాట, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అణచివేయాలని సూచించారు.

జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని పలు కళాశాలలు, హాస్టళ్లకు చెందిన విద్యార్థినులు జ్వరంతో బాధపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో హాస్టళ్ల భవనాల చుట్టూ మురుగు నీరు నిలిచి దోమలతో సతమతమవుతున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు జలుబు, జ్వరంతో బాధపడుతున్నారు. కాగా గురుకుల డిగ్రీ హాస్టల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు జ్వరంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ వైరు కాళ్లకు తాకి..

– షాక్‌తో రైతు మృతి


మిస్‌పూర్ శేఖర్

పాపన్నపేట(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మిస్‌పూర్ శేఖర్(30)పొలానికి వెళ్తూ.. హైదరాబాద్‌లో ఉంటున్న తన తమ్మునితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో తెగి పడిన విద్యుత్ వైరును చూడకపోవడంతో కాళ్లకు తగిలింది. షాక్ కొట్టగానే అరుస్తూ కిందపడ్డాడు. ఫోన్‌లో అన్న అరుపు విన్న తమ్ముడు అప్రమత్తమై కుటుంబీకులకు చెప్పాడు. వెంటనే వాళ్లు పొలం వద్దకు వెళ్లి కొన ఊపిరితో ఉన్న శేఖర్‌ను మెదక్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య యశోద, కొడుకులు ప్రదీప్, హర్షవర్ధన్ ఉన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సోనీ

నిజాంపేట(మెదక్): మండలంలోని ఖాసీంపూర్ తండాలో సోమవారం ఓ గిరిజన వ్యక్తి మృతి చెందడంతో కూతురు తలకొరివి పెట్టింది. తండాకు చెందిన ధరావత్ చంద్రు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి కూతురు సోనీ మాత్రమే ఉంది. దీంతో అతని మృతదేహానికి కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

పోక్సో కేసులో ఒకరికి జైలు

పెద్దశంకరంపేట(మెదక్): పోక్సో కేసులో కోర్టు ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమాన విధించింది. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల పరిధిలోని మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన నిందితుడు తలారి మోహన్ 2020లో ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్ ఆశ చూపి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పూర్తి కావడంతో మెదక్ ఫాస్ట్రాక్ కోర్టు జడ్జి నీలిమ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

పోషక లోప నివారణ.. ఆరోగ్య రక్షణ

చిన్నారులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. కార్యక్రమానికి జిల్లా అధికారులు సంసిద్ధులయ్యారు. జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు చెక్కెర, ఉప్పు, నూనె వాడకం పరిమితిపై ప్రచారం నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు నిత్యం ఓ కార్యక్రమం నిర్వహించేందుకు క్యాలెండర్‌ను రూపకల్పన చేశారు.

– నారాయణఖేడ్:

జిల్లాలో నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్, సదాశివపేట్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో మూడేళ్లలోపు చిన్నారులు 55,502 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 49,530 మంది నమోదై ఉన్నారు. గర్భిణి స్త్రీలు 11,594, బాలింతలు 6,684 మంది కాగా, తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలు (ఎస్ఏఎం) 545, తక్కువ పోషకాహార లోపం ఉన్న పిల్లలు (ఎంఏఎం) 3,236 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చిన్నారులను పోషకాహార లోపం సమస్యల నుంచి దూరం చేసేందుకు ఈ కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టనున్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రతీ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, సీడీపీఓ కార్యాలయానికి రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేశారు.

17 నుంచి పోషణ మాసం షురూ..

- చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహణ
- నెల రోజులపాటు నిత్యం ఓ కార్యక్రమం


నారాయణఖేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

నిత్యం కార్యక్రమాలు

ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు రోజుకో కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి, పాలిచ్చే తల్లులు, శిశువులు, చిన్నపిల్లల పోషణపై సలహా సమావేశం, పౌష్టికాహారం తయారీపై వంటకాల పోటీలు, కిశోర బాలికలకు, పెద్దవాళ్ల కోసం బీఎంఐ పరీక్షలు, పిల్లల కోసం ఎత్తు, బరువు, కొలతలు తీయడం, ఆహారంలో చెక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించే విషయంపై అవగాహన కల్పించనున్నారు. తండ్రులతో పోషకాహార ప్రతిజ్ఞ, 3 ఏళ్లలోపు పిల్లల ఆరంభ అభివృద్ధి, స్థానిక ఉత్పత్తులు, బొమ్మలపై అవగాహన కల్పిస్తారు. వంటకాలు స్వయంగా తయారు చేయడం, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టడంపై, ఆహారపు అలవాట్లు అలవర్చుకునేలా వివరిస్తారు. ఆరోగ్యవంతమైన పిల్లలు, తల్లులు, పోషణ లోపం ఉన్న వారి మధ్య అనుభవం పంచుకోవడం, చిరు ధాన్యాలు, ఫలాలు, కూరగాయలపై, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు, రక్తహీనత, అధిక బరువు వల్ల వచ్చే సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన చేపట్టనున్నారు.



ప్రతి ఇంటికీ పోషణ సందేశం

చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగు పర్చే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మహోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికి పోషణ సందేశం చేరవేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. పోషణ మాసంలో ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములను చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులకు ఆ శాఖ ద్వారా లేఖలు కూడా పంపించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించనున్నారు. పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, పోషకాహారం అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

నిర్వహణకు ఏర్పాట్లు



జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం నిత్యం ఓ కార్యక్రమం నెల పాటు నిర్వహిస్తాం. చిన్నారులు, మహిళలకు ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన కల్పించనున్నాం.

– లలితకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సంగారెడ్డి

ప్రతిష్టాత్మకంగా బతుకమ్మ ఏర్పాట్లు

కోమటిచెరువును పరిశీలించిన బృందం


కోమటిచెరువును పరిశీలిస్తున్న బల్దియా

సిద్దిపేటజోన్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ పండుగ ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని బల్దియా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజుతో కూడిన బృందం కోమటిచెరువును సందర్శించింది. బొడ్డెమ్మ, ఎంగిలి బతుకమ్మ, సద్దుల బతుకమ్మల నిమజ్జనంచేసే కోమటి చెరువు వద్ద ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మిగతా చెరువులు, కుంటల వద్ద బతుకమ్మ ఘాట్, విద్యుత్ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. నెక్లెస్ రోడ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రేరణ, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తారా? చావమంటారా?


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

గజ్వేల్‌రూరల్: మాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని మహిళా సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహిళ గ్రూపు సభ్యులు మున్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు తెలియకుండానే బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకుని, ప్రస్తుతం ఆ డబ్బులు కట్టాలని లీగల్ నోటీసులు అందించడం ఎంత వరకు న్యాయమన్నారు. ఆర్పీలు కృష్ణలీల, మంజుల సభ్యుల డబ్బులను గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా..

- డివైడర్‌ను ఢీకొట్టి ఔటర్‌పై కారు బోల్తా
- యువతి మృతి, ఏడుగురికి గాయాలు


ఔటర్‌పై బోల్తాపడిన కారు


సౌమ్యారెడ్డి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్ / జిన్నారం (పటాన్‌చెరు): స్నేహితులంతా కలిసి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ఔటర్ రింగ్‌రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ యువతి మృతిచెందగా ముగ్గురికి తీవ్ర, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన రాళ్లకత్వ వెంకటేశ్వర్ రెడ్డి కూతురు సౌమ్యారెడ్డి (25) నగరంలోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. తన స్నేహితులైన నందకిశోర్, వీరేంద్ర, ప్రణీష్, సాగర్, అరవింద్, ఝాన్సీ, శృతితో కలిసి ఆదివారం కారులో రాచకొండ సమీపంలోని సరళ మైసమ్మ దేవాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి బొంగ్లూర్ వద్ద ఔటర్‌పై నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బలిజగూడ సమీపంలోకి రాగానే భారీగా కురుస్తున్న వర్షం కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో సౌమ్యారెడ్డితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సౌమ్యారెడ్డి చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా దర్శనానికి అని వెళ్లిన కూతురు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు, అక్క రమ్యారెడ్డి కన్నీరు మున్నీరవుతున్నారు. సౌమ్యారెడ్డి మృతితో వావిలాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుంటలో బాలుడి గల్లంతు

జహీరాబాద్ టౌన్: ఈతకు వెళ్లిన బాలుడు కుంటలో గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం ... కోహీర్ మండలం పిచరాగడి గ్రామానికి చెందిన రిజ్వాన్(17) స్నేహితులు సలీం, గుల్లుతో కలిసి సోమవారం హుగ్గెల్లి గ్రామ శివారులో గల కుంటలో ఈత కొట్టేందుకు వచ్చారు. రిజ్వాన్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఈత రాకపోవడంతో నీట మునిగాడు. ఈ ఘటనతో భయపడిన స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కుంటలో గాలింపు చేపట్టారు. చీకటి పడుతున్నా బాలుడి ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గాలింపు చేపట్టనున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు.

కొండముచ్చుల దాడిలో వ్యక్తికి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో సోమవారం కొండముచ్చులు వ్యక్తిపై దాడి చేశాయి. ఈ దాడిలో శాంతినగర్‌కు చెందిన అమర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల క్రితం రాంనగర్, గాంధీనగర్ ప్రాంతంలో కొండముచ్చుల గుంపు రోడ్డుపై నుంచి వెళ్తున్న ప్రజలపై దాడి చేయగా శరణమ్మ, రాజ్‌కుమార్‌లకు గాయాలైన విషయం తెలిసిందే. వరుసగా కొండముచ్చులు దాడి చేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిస్టులే.. సాయుధ పోరాట వారసులు


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ సాయుధ పోరాట వారసులు భారత కమ్యూనిస్టు నేతలేనని సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం మహ్మదాపూర్‌లో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించింది కమ్యూనిస్టులేనన్నారు. చరిత్ర చెరిపేస్తే పోయేది కాదని ఏడాది పాటు సాగిన సాయుధ పోరాటంలో 4,500 మంది సీపీఐ నేతలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆనాటి సాయుధ పోరాటంను హిందు, ముస్లింలకు జరిగినట్లుగా బీజేపీ నాయకులు చిత్రీకరించి చెబుతున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లు గడిచినా విమోచన దినాన్ని అధికారికంగా జరపడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం


పెచ్చులూడిన పైకప్పు.

అల్లాదుర్గం(మెదక్): పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల స్లాబు పెచ్చులూడి కింద పడ్డాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి గడి పెద్దాపూర్ జెడ్పీ పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ భవనాన్ని 60 ఏళ్ల క్రితం నిర్మించారు. కొన్ని గదులు రేకులతో నిర్మించగా వాటికి రంధ్రాలు పడ్డాయి. మరో రెండు గదులు సైతం శిథిలావస్థకు చేరుకొని వర్షం పడితే గదుల్లోకి నీరు చేరుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తరతిగది పెచ్చులూడి పడ్డాయి. విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రసవానికి వెళితే పుస్తె అపహరణ

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఘటన

జోగిపేట(అందోల్): ఆస్పత్రికి ప్రసవానికి వెళితే పుస్తెను అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఈనెల 13న అందోలు మండలం పోసానిపేట గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి ప్రసవం కోసం జోగిపేట ఏరియా ఆస్పత్రిలో చేరింది. సర్జరీ తప్పనిసరి కావడంతో శనివారం ఆ మహిళను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. ఆపరేషన్ సమయంలో సిబ్బంది థియేటర్ ప్రక్క గదిలోకి తీసుకువెళ్లి మెడలో పుస్తె, బంగారు ఆభరణాలు(నాలుగు గ్రాములు) తీసేశారు. అదే రోజు సర్జరీ చేశారు. ఆ మహిళ ఆడపిల్లకు జన్మనిచ్చింది. సర్జరీ తర్వాత బయటకు వచ్చాక బంగారు పుస్తెను భర్తను అడుగగా తనకు ఇవ్వలేదని చెప్పాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సిబ్బందిని అడుగగా తమకు తెలియదని చెప్పారు. ఈ వివాదం ఆస్పత్రి సూపరింటెండెంట్ సౌజన్య వద్దకు వెళ్లడంతో సిబ్బందిని పిలిచి మందలించింది. అయినా ఫలితం లేకపోవడంతో బాధితురాలి భర్త అశోక్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం రూ.40వేల విలువ ఉంటుందని బాధితులు తెలిపారు. అయితే ఆడపిల్ల పుట్టగానే రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, రూ.వెయ్యి ఇచ్చినట్లు బాధిత మహిళ చెప్పారు.

మార్షల్‌ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం



కరాటేలో వివిధ బెల్ట్‌లు సాధించిన విద్యార్థినులు

104 మందికి బెల్ట్‌లు ప్రదానం

వర్గల్(గజ్వేల్): మార్షల్ ఆర్ట్స్ బాలికలకు ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందింపజేస్తాయని పూలే బాలికల గురుకుల బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం గురుకులంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు డైనమిక్ షోటోకాన్ అసోసియేషన్ బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 104 మంది విద్యార్థులకు వారి స్థాయిలను బట్టి బ్రౌన్, పర్పుల్, బ్లూ, ఆరెంజ్, ఎల్లో బెల్ట్‌లను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శాలిని, పీడీ లోకేశ్వరి పాల్గొన్నారు.

కరాటే పోటీలకు గజ్వేల్ విద్యార్థులు


కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు గజ్వేల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్‌లు నరేష్, నరేందర్‌లు సోమవారం పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మెదక్‌లో అండర్-14 విభాగంలో జరుగుతున్న కరాటే పోటీలలో బాలికల 38కిలోల విభాగంలో గజ్వేల్‌కు చెందిన సీహెచ్ భవిష్య, 42 కిలోల విభాగంలో అమృత వర్షిని, 50కిలోల విభాగంలో విజయదీక్షిత, బాలుర 25కిలోల విభాగంలో లక్ష్మణ్, 40కిలోల విభాగంలో ఎస్. రాహుల్‌లు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుబ్బాక: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని మతోన్మాదులు చరిత్రను వక్రీకరించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సీపీఎం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి ,వెట్టి చాకిరీ విముక్తి కోసం దున్నేవాడికే భూమి దక్కాలని దొరలు, భూస్వాములు, రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు నిర్వహించి 10 లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఈ సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భాస్కర్, జిల్లా నాయకులు గోపాలస్వామి, నవీన, భాస్కర్, ఎల్లయ్య, సాధిక్ పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

ప్రేమ వ్యవహారమే కారణమా?

తూప్రాన్: ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... మాసాయిపేట మండలం చేట్ల తిమ్మాయిపల్లికి చెందిన కమ్మరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు నరేశ్‌చారి అలియాస్ నితిన్(22) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న నరేశ్‌చారి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కొడుకు మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరెంటు వైరు లాగుతుండగా..

- షాక్ కొట్టి ఇద్దరు కార్మికులకు గాయాలు
- మెదక్ జిల్లాలో ఘటన


రేకుల షెడ్డుపై పడిన సంతోష్‌ను కిందకు దించుతున్న ఫైర్ సిబ్బంది


షాక్‌కు గురై కరెంటు వైరుపై వేలాడుతున్న అనిల్

నర్సాపూర్: కరెంటు వైరు లాగుతుండగా సోమవారం ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలు ఇలా... నర్సాపూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు కొత్త భవనం మంజూరు కావడంతో నిర్మాణ పనులు ఇటీవల చేపట్టారు. భవనం నిర్మిస్తున్న స్థలం మీదుగా కరెంటు వైర్లు ఉండటంతో వాటిని తొలగించి కొత్త వైరు లాగే పనులు విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ స్వామికి అప్పగించారు. సోమవారం ఐదుమంది కార్మికులతో ఫైర్ స్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి హై టెన్షన్(హెచ్‌టీ) కరెంటు సప్‌లై టవర్ మీదుగా పనులు చేపట్టారు. ఈ క్రమంలో కార్మికుడు అనిల్ హెచ్‌టీ కరెంటు సప్‌లై టవర్ వద్ద పని చేస్తుండగా మరో కార్మికుడు సంతోష్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని స్తంభం వద్ద పనులు చేస్తున్నారు. అనిల్‌కు కరెంటు షాక్ తగలడంతో హెచ్‌టీ సప్‌లై టవర్ నుంచి మరో స్తంభానికి ఉన్న కండక్టర్ వైరుపై వేలాడాడు. సంతోష్‌కు షాక్ కొట్టడంతో పక్కనే ఉన్న దుకాణం రేకుల షెడ్డుపై పడ్డాడు. కాగా వైరుపై వేలాడుతున్న అనిల్‌ను కిందకు దించేందుకు ఫైర్ స్టేషన్ సిబ్బంది ప్రయత్నించే లోపు నేలపై పడ్డాడు. సంతోష్‌ను రేకుల షెడ్డుపై నుంచి ఫైర్ సిబ్బంది కిందకు దించారు. ఇద్దరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం అనిల్‌ను గాంధీ ఆస్పత్రికి , సంతోష్‌ను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనిల్ కౌడిపల్లి మండలం గౌతాపూర్ తండా, సంతోష్ అదే మండలం కొత్త చెరువు తండాకు చెందిన వాడు. కాగా ఇద్దరు కొంత కాలంగా కరెంటు కాంట్రాక్టర్ల వద్ద కార్మికులుగా పని చేస్తున్నారని తెలిసింది. ఇదిలా ఉండగా.. వైరు లాగే పనులు చేపట్టేందుకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ శాఖ ఉద్యోగి, కాంట్రాక్టర్ ఎల్‌సీ తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎల్‌సీ తీసుకుని పనులు చేపట్టారు: ఏడీఈ

ఫైర్ స్టేషన్‌కు కొత్త భవనం నిర్మించాలనుకున్న చోట కరెంటు వైర్లు ఉన్నందున వాటిని తొలగించి కొత్త వైర్లు లాగాలని ఫైర్ స్టేషన్ అధికారులు కోరారని స్థానిక ఏడీఈ రమణారెడ్డి తెలిపారు. అందులో భాగంగా కాంట్రాక్టర్ స్వామికి పనులు అప్పగించారన్నారు. స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ శివరాం లైన్ క్లియర్ తీసుకున్న తర్వాత పనులు చేపట్టారని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.